సాక్షి జగిత్యాల

సోమవారం ၊ 29 ၊ మే ၊ 2023



గోదావరిలో స్నానాలు

ధర్మపురి: గోదావరి నదిలో ఆదివారం భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గంగమ్మ, గౌరమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.



ఘనంగా పెద్దమ్మతల్లి జాతర

కథలాపూర్ : సిరికొండలో ముదిరాజ్ సామాజిక వర్గం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
41.0/28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వగలు ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

'గేట్ వే ఆఫ్ జగిత్యాల'



స్తూపాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: జిల్లా కేంద్రంలో నిర్మించిన అమరవీరుల స్మారక స్తూపం ఉద్యాన వనం గేట్‌వే ఆఫ్ జగిత్యాలగా నిలుస్తుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. పట్టణంలో నిర్మించిన అమర వీరుల స్మారక స్తూపం పార్క్‌ను జూన్ 2న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రారంభించనున్నారు. తుదిదశకు చేరిన పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. పట్టణవాసుల మానసిక ఒత్తిడిని దూరం చేయడానికి, ఆహ్లాదం పంచడం లక్ష్యంగా స్తూపం నిర్మించినట్లు తెలిపారు. ఆయన వెంట కమిషనర్ నరేశ్, డీఈ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

సావర్కర్ జయంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక దామోదర్ సావర్కర్ జయంతిని భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తహసీల్ చౌరస్తాలో నిర్వహించారు. సావర్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సమితి జిల్లా ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు, జనార్దన్‌రెడ్డి, బండి సత్యనారాయణ, అరుణ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతు అరిగోస



రైతు భూమక్క

జగిత్యాలరూరల్: కన్నాపూర్ గ్రామానికి చెందిన రెంక భూమక్క రైతుల నుంచి కొంత భూమి కౌలుకు తీసుకుంది. యాసంగిలో వరి సాగు చేసింది. స్థానికంగా ఉన్న ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ఈనెల 26న సుమారు 150 బస్తాల ధాన్యం విక్రయించగా, బస్తాపై రెండు కిలోల చొప్పున కోత విధించారు. మరోసారి గత శనివారం 207 బస్తాల ధాన్యం విక్రయించగా, బస్తాపై 41 కిలోల చొప్పున తూకం వేశారు. ఆ ధాన్యం రైస్‌మిల్లుకు తరలించారు. అయితే, కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలు ఆదివారం కౌలు రైతు భూమక్కకు ఫోన్‌చేసింది. బస్తాపై 3 కిలోలు కోత విధిస్తేనే ధాన్యం అన్‌లోడ్ చేసుకుంటానని చెబుతున్నాడని సమాచారం ఇచ్చింది. దీనికి భూమక్క అంగీకరించక.. తన ధాన్యం తనకు ఇప్పించాలని కోరింది. అయితే, 'ధాన్యం కావాలంటే కేసీఆర్ వద్దకు వెళ్లి తెచ్చుకో'అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిందని కౌలు రైతు భూమక్క ఆవేదన చెందింది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి తన గోడు వెళ్లబోసుకుంది.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. 2023 గ్రాండ్ మాస్టర్ వీరాచారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల పోటీలు నిర్వహించారు. వొల్లాల రిషిత్, గుండ సంజన, కనుక అకిరానందన్ కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించారు. సాహిత్యత, కరుణశ్రీ, హర్షవర్ధన్, సిల్వర్ మెడల్ సాధించారు.

కొందరికే రాయితీ గొర్రెలు

- జిల్లాలో గుర్తించిన అర్హులు 21,067 మంది
- తొలివిడతలో 17,450 మందికి యూనిట్లు పంపిణీ
- రెండోవిడతలో కేటాయించిన యూనిట్లు 3,617
- కొత్తగా సభ్యత్వం తీసుకున్నవారు 3వేల మంది
- మలివిడతలో వీరికి ప్రభుత్వం మొండిచేయి



గొర్రెలను మేతకు తీసుకెళ్తున్న పెంపకందారులు

కథలాపూర్(వేములవాడ): రెండోవిడత గొర్రెల పంపిణీకి అధికారులు ఒకవైపు కసరత్తు చేస్తుండగా.. మరోవైపు.. సొసైటీల్లో కొత్తగా సభ్యత్వం తీసుకున్నవారిలో ఆందోళన నెలకొంది. గతంలో సభ్యత్వం ఉన్నవారికే సబ్సిడీ గొర్రెలు అందిస్తారని తాజాగా ప్రభుత్వం నిబంధన తెచ్చిందని తెలియడంతో గొర్రెలు పెంచాలనుకునేవారు నిరాశకు గు రవుతున్నారు. సబ్సిడీపై గొర్రెలు అందిస్తే వాటిని పెంచుకొని ఉపాధి పొందుతామనుకున్న పలువురు యువకులు ప్రభుత్వ నిబంధన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 3 వేల మంది ఆశావాహులు ఉన్నట్లు తెలిసింది.

జిల్లాలో 21,067 మంది సొసైటీ సభ్యులు..

- సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రభుత్వం 2017లో ప్రారంభించింది.
- అప్పటివరకు సొసైటీల్లో నమోదైన గొర్రెల పెంపకందారుల వివరాలు సేకరించగా.. జిల్లాలో 21,067 మంది ఉన్నట్లు గుర్తించారు.
- వీరందరికీ ఒకేసారి గొర్రెలు ఇవ్వడం కష్టమని భావించిన ప్రభుత్వం.. తొలివిడతలో 50శాతం మందికి, ఆ తర్వాత మిగతా వారికి అందించాలని నిర్ణయించింది.
- ఇందుకోసం గ్రామాల వారీగా గొర్రెల పెంపకందారులతో సమావేశమయ్యారు.
- లక్కీడ్రా ద్వారా 50 శాతం మంది లబ్ధిదారులను ఎంపిక చేసి రాయితీపై గొర్రెలు పంపిణీ చేశారు.
- ఏడాది తర్వాత.. అంటే రెండో జాబితాలో మిగతా 50శాతం మందికి గొర్రెలు అందజేశారు.



- ఈ యువకుడి పేరు కుంభం భూమేశ్, కథలాపూర్ మండలం దూలూర్ స్వగ్రామం. ఇంటర్ వరకు చదువుకున్నాడు. రెండేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. స్వయం ఉపాధి కోసం రాయితీపై గొర్రెలు పెంచుకోవాలనే ఆసక్తితో అధికారులను సంప్రదించాడు. ఐదేళ్ల క్రితం సభ్యత్వం ఉన్న వారికే గొర్రెల యూనిట్లు పంపిణీ చేస్తామని, కొత్తవారికి అవకాశం లేదని వారు సమాధానం చెప్పాడు. కొత్తవారి కి అవకాశం లేదని వారు సమాధానం ఇవ్వడంతో నిరాశ చెందాడు. ఇలాంటివారు ఆ గ్రామం పదిమంది వరకు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 3వేల మంది ఆసక్తి చూపిస్తున్నారు.

పంపిణీ చేసింది 17,450 యూనిట్లే..

జిల్లాలో 21,067 మంది గొర్రెల పెంపకందారులు ఉండగా.. వీరికి 21,067 యూనిట్లు కేటాయించారు. తొలి జాబితా ఏ- లో 10,557 మందికి జీవాలను అందించాల్సి ఉండగా.. 9,756 మంది తీసుకున్నారు. జాబితా బీ- లో 10,510 మందికి 7,694 మంది గొర్రెల యూనిట్లు తీసుకున్నారు. ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఉంటాయి. యూనిట్ ధర రూ.1.25 లక్షలు ఉండగా లబ్ధిదారు వాటా ధనం రూ.31,250 చెల్లించారు. ఈ ప్రక్రియ అప్పట్లోనే ముగిసింది.

రెండోవిడతలో 3,617 యూనిట్లు..

- జిల్లాకు రెండోవిడతలో సబ్సిడీ గొర్రెల పంపిణీకి 3,617 యూనిట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.
- రెండోవిడత యూనిట్ ధరను ప్రభుత్వం పెంచింది. దీంతో లబ్ధిదారు ఆందోళన చెందుతున్నాడు.
- రెండోవిడతలో యూనిట్ ధర రూ.1.75 లక్షలు ఉండగా.. లబ్ధిదారు తన వాటాధనం రూ.43,750 చెల్లించాలి.
- ఇది తమపై అదనపు భారమని కాపరులు వాపోతున్నారు.
- అందుకే రెండోవిడతలో ఇప్పటివరకు 1,200 మందే తమ వాటా ధనంపై డీడీలు తీశారు.

కొత్తవారికి అవకాశం ఎప్పుడో..?

- గత రెండేళ్లలో వివాహాలు చేసుకున్న పలువురు యువకులు గొర్రెల పెంపకందారుల సొసైటీల్లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. మరికొందరు గల్ఫ్ నుంచి స్వగ్రామాలకు వచ్చి స్థిరపడ్డారు. ఇలాంటివారికి రాయితీపై గొర్రెల యూనిట్లు మంజూరు కావడంలేదని గొల్ల, కురుమలు చెబుతున్నారు. తాము గొర్రెల పెంపకం చేపట్టి స్వయం ఉపాధి పొందాలని ఆశపడుతున్నా.. మంజూరు కావడంలేదని వాపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని, అందుకు తగ్గట్టు సొసైటీల్లో సభ్యత్వం తీసుకున్నవారి వివరాలు అధికారులు సేకరించి కొత్త యూనిట్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

యూనిట్లు కేటాయించాలి



నేను మా ఊరిలో వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేసుకుంటున్న. సబ్సిడీపై ప్రభుత్వం గొర్రెలు అందించడం సంతోషమే. కానీ, 18ఏళ్ల వయసు నిండిన వారికి కూడా సబ్సిడీ గొర్రెల యూనిట్లు కేటాయించాలి.

– ఉంబరవేని మనోజ్, పోతారం

21,067 యూనిట్లకే అనుమతి



2017 వరకు జిల్లాలో గొర్రెల పెంపకందారుల సొసైటీలో 21,067 మంది సభ్యులు ఉన్నట్లు గుర్తించారు. వీరికి మాత్రమే 21,067 గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. విడతల వారీగా మంజూరు చేస్తున్నారు. తొలివిడతలో రెండు జాబితాలు తయారు చేశారు. ఇందులో 17,450 యూనిట్లు మంజూరయ్యాయి. గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తయింది. రెండోవిడతకు 3,617 యూనిట్లు కేటాయించారు. వీటిని పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– గోపాలకృష్ణమూర్తి,
జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

ఇష్టంగా పని చేస్తేనే విజయం

- డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య
- విద్యార్థులకు జీకే పుస్తకాలు పంపిణీ



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ మొండయ్య

మల్యాల(చొప్పదండి): ప్రతీపనిని ఇష్టంతో చేయాలని, క్రమశిక్షణ జీవితానికి పునాది వంటిదని, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా తట్టుకునే మానసిక స్థైర్యం పెంపొందుతుందని ఉమ్మడి కరీంనగర్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య అన్నారు. ఆదివారం లంబాడిపల్లి గ్రామంలోని మై విలేజ్ షో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మానవ వనరుల అభివృద్ధి భవనంలో పదో తరగతి, ఇంటర్మీడియేట్ విద్యార్థులకు విద్య, ఉద్యోగం, వ్యక్తిత్వం అంశాలపై అవగాహన కల్పించారు. 50మంది విద్యార్థులకు జీకే పుస్తకాలు పంపిణీ చేశారు. శ్రీరాం మొండయ్య మాట్లాడుతూ నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకుంటూ ముందుకుసాగాలన్నారు. నీతిగా ఉండాలని, విలువలతో కూడిన జీవితాన్ని గడపాలని అన్నారు. ఇష్టంతో చేస్తే ఏ పనిలోనైనా విజయం సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో మై విలేజ్ షో ఫేం గంగవ్వ, అనిల్ జీలా, శ్రీరాం శ్రీకాంత్, ఉద్యోగులు శేఖర్, అంజిమామా, సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు?'

జగిత్యాలటౌన్: ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలని హడావుడి చేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఉద్యమ ఆకాంక్షలను విస్మరించి, ప్రాజెక్టుల పేరిట ప్రజాధనాన్ని కొల్లగొట్టి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టినందుకు దశాబ్ది ఉత్సవాలు చేసుకుంటున్నారా? అని ఎద్దేవా చేశారు. స్థానిక ఇందిరాభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పుట్టబోయే ప్రతీబిడ్డకు రూ.1.25లక్షల అప్పు మిగల్చడం తప్ప సీఎం కేసీఆర్ చేసిందేమీ లేదని విమర్శించారు. ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. వచ్చేఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 80వేల ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు విడుదల చేసి.. పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టారన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమని, ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు.

అడవులే స్థావరాలు

- చెట్లు, గుట్టలు రక్షక కవచాలు
- జిల్లాలో గుప్పుమంటున్న గుడుంబా
- అప్రమత్తమైన పోలీసు, ఎక్సైజ్ అధికారులు
- తయారీ, రవాణాపై ఉక్కుపాదం
- 17 నెలల్లో 438 కేసులు .. 427 మంది అరెస్ట్




అటవీ ప్రాంతంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

జగిత్యాలక్రైం: జిల్లాలోని అడవులు, గుట్టలు, వాగులు, చెరువులను స్థావరాలుగా చేసుకుని గుడుంబా తయారు చేస్తున్నారు. చెట్లు, పుట్టలు, చేమలను రక్షక కవచాలుగా వినియోగిస్తున్నారు. రాత్రిపూట వాహనాల్లో ఎవరి కంటా పడకుండా రవాణా చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో జోరుగా విక్రయిస్తున్నారు. అప్రమత్తమైన ఎక్సైజ్, పోలీసు అధికారులు ప్రత్యేక బృందాలతో రవాణా, అమ్మకాల నిరోధానికి దాడులు చేస్తున్నారు. గుడుంబాతో అనారోగ్యానికి గురవుతుండటంతో పాటు ప్రభుత్వ మద్యం అమ్మకాలు తగ్గుతుండటంతో రెండు శాఖలు సమన్వయంతో గుడుంబా అక్రమ రవాణాపై కొరడా ఝులిపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తుండటంతో పాటు, గుడుంబా విక్రయించిన వారిపై గుడుంబా సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు చేపడుతూ గుడుంబా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు.

2022లో 379 కేసులు నమోదు:

- జిల్లాలో గుడుంబాను అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.
- 2022లో గుడుంబా తయారీ, విక్రయం, రవాణా చేసే వారిపై 379 కేసులు నమోదు చేసి 365 మందిని అరెస్ట్ చేశారు.

కేసుల వివరాలు			స్వాధీనం చేసుకున్న గుడుంబా(లీటర్లలో)	స్వాధీనం చేసుకున్న వాహనాలు
సంవత్సరం	కేసులు	అరెస్ట్‌లు		
2022	379	365	1716	98
2023(ఇప్పటివరకు)	59	62	184	17



- వారినుంచి 1,716 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు.
- గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 4,690 లీటర్ల బెల్లం పానకం పారబోశారు.
- 1,713 కిలోల బెల్లం సీజ్ చేశారు.
- 98 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు, గుడుంబా తయారీ, రవాణా, విక్రయించే 587మందిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు.
- ఇందులో 17 మంది బైండోవర్ ఉల్లంఘించిన వారుకగా, 12 మంది రూ.12.20 లక్షలు జరిమానా ప్రభుత్వ ఖాజానాకు చెల్లించారు. ఇద్దరు జైలుకు వెళ్లారు.

2023లో 137 మంది బైండోవర్..

2023 జనవరి నుంచి ఇప్పటివరకు 59 మందిపై కేసులు నమోదు చేసి 62 మందిని అరెస్ట్ చేశారు. 184 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. 350 లీటర్ల బెల్లం పానకం పారబోశారు. 25 కిలోల బెల్లం సీజ్ చేయడంతోపాటు, 17 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. 137 మందిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. ముగ్గురు నిబంధనలు ఉల్లంఘించారు. అందులో ఇద్దరు జైలుకు వెళ్లగా ఒకరు రూ.లక్ష జరిమానా చెల్లించాడు.

బెల్లం, స్పటిక విక్రయాలపై నిఘా పటిష్టం..

- జిల్లాలో గుడంబా తయారీకి ఉపయోగించే ముడిసరుకులు బెల్లం, స్పటిక విక్రయాలపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నిఘా పటిష్టం చేస్తున్నారు.
- బెల్లం, స్పటిక విక్రయించే వ్యాపారులపై కూడా కేసులు నమోదు చేస్తున్నారు.
- నల్లబెల్లం విక్రయాలపై నిఘా పెంచారు.
- గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం, స్పటిక సీజ్ చేయడంతో పాటు, విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

గుడుంబా రహిత జిల్లా లక్ష్యం



జగిత్యాలను గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు తయారీ, రవాణాపై నిఘా పటిష్టం చేశాం. టాస్క్‌ఫోర్స్ బృందాలతో పాటు, పోలీసు, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలు గుర్తించి తయారీ, విక్రయ, రవాణాదారులపై కేసులు నమోదు చేస్తున్నాం.

– శ్రీధర్,
జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి

పథకాలపై చర్చ అవసరం

- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి(ధర్మపురి): ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై గ్రామాల్లోని రచ్చబండల వద్ద చర్చ జరుగాలని, ఇందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు కీలకపాత్ర పోషించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. 40 ఏళ్లకాంగ్రెస్, ఆ తర్వాత వచ్చిన బీజేపీ పాలకులు తెలంగాణ ప్రజలకు ఏం చేశారనే విషయాలపై నిలదీయాలని కోరారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలగం అన్నారు. వారితో అనుబంధం పెంచుకునేందుకే సీఎం కేసీఆర్ ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సజావుగా ధాన్యం సేకరిస్తున్నా.. కాంగ్రెస్ శ్రేణులు రోడ్డెక్కుతూ రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. దీన్నిదృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితుడు రమణారావు, జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, ఏఎంసీ చైర్‌పర్సన్ నిర్మల, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ జమున, వైస్ ఎంపీపీ గంగాధర్, ఆర్బీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

యువత, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత అన్నారు. మండల కేంద్రంలో వోరుగంటి రమణారావు ఆధ్వర్యంలో ఆర్ఆర్ ఫ్యాన్స్ నెల రోజులుగా నిర్వహించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్ఆర్ పీపీఎల్-3 క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. మొత్తం 92 జట్లు పాల్గొనగా గంగాధర జట్టు ప్రథమ, పెగడపల్లి జట్టు ద్వితీయ, గొల్లపల్లి మండలం రాఘవపట్నం జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులు అందించాక వారు మాట్లాడారు. క్రీడలు ఆత్మ విశ్వాసాన్ని పొంపెందిస్తాయని, మానసిక ఒత్తిడి తగ్గిస్తాయని అన్నారు. ఎంపీపీ శోభ, ఏఎంసీ చైర్మన్ నిర్మల, వైస్ ఎంపీపీ గంగాధర్, సింగిల్‌విండో చైర్మన్లు రమణారావు, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన కమ్మునూరు కాలువ

- మరమ్మతు చేయాలని రైతుల డిమాండ్

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని గోదావరి తీరం వెంట విస్తరించిఉన్న కమ్మునూర్ గ్రామ శివారులో అధికమంది దళిత రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరితోపాటు ఇతర వర్గాల రైతుల భూములు కూడా తీరం వెంట బాగానే ఉన్నాయి. అయితే, పంటలు పండించడానికి ప్రధాన నీటి వనరు కమ్మునూరు కాలువే. ఇది శిథిలావస్థకు చేరడంతో వానాకాలంలో పంటలకు నీళ్లు ఎలా అందుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఏటా తిప్పలే..

- బీర్‌పూర్ మండలంలోని కాలువ చివరి గ్రామాల్లో కమ్మునూర్ కూడా ఒకటి.
- ఏటా యాసంగిలో సాగునీటి కోసం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.
- ఈ కాలువ కింద అన్ని వర్గాల రైతులు పంటలు పండిస్తున్నారు.
- రోళ్లవాగు ప్రాజెక్టు, అరగుండాల ప్రాజెక్టు పనులు దాదాపు చివరి దశకు చేరాయి.
- ఈ తరుణంలో కాలువ మరమ్మతు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.
- రోళ్లవాగు ప్రాజెక్టు ఆర్‌పీఎల్‌బీ(రోళ్లవాగు ఎడమ కాలువ)ద్వారా కమ్మునూర్ గ్రామంలోని ఆయకట్టుకు నీరు చేరుతుంది.
- దీనితోపాటు తాళ్లధర్మారం గ్రామ శివారు అరగుండాల ప్రాజెక్టు నుంచి వచ్చే, కమ్మునూర్ ఎత్తిపోతల ద్వారా, కండ్లపల్లి ఊరచెరువు నుంచి వచ్చే మిగులు నీరు ఈ కాలువలోకి చేరి ఆయకట్టు పంటలను పండిస్తోంది.

కాలువ పొడవు 1.5 కిలో మీటర్లు..

కాలువ పొడవు సుమారు 1.5 కిలో మీటర్లు ఉంటుంది. పలుచోట్ల కాలువ శిథిలమైంది. పొలాలకు సాగునీరు చేరడం లేదు. ఐదు ప్రదేశాల్లో కచ్చితంగా మరమ్మతు చేస్తేనే పొలాలకు నీరు వచ్చే అవకాశం ఉంది. లేదంటే వానాకాలంలోనూ సాగునీరు అందే వీలులేదు.

రోడ్ల మరమ్మతు తప్పనిసరి..

పంట పొలాలకు రైతులు వెళ్లేందుకు కాలువగట్టే ఆధారం. ఆయకట్టు రోడ్డు ప్రస్తుతం నడిచేందుకు కూడా వీలులేకుండా గుంతలుపడింది. ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు వెచ్చించి, తాత్కాలిక మరమ్మతు చేస్తే సమస్య కొంత తీరుతుందని రైతులు చెబుతున్నారు.



ధ్వంసమైన కమ్మునూరు కాలువ, పైపు



మరమ్మతు చేయాలి

కమ్మునూరు కాలువ శిథిలమైంది. పొలాలకు సాగునీరు సరిగ్గా అందడం లేదు. ప్రధానంగా వరి చిరుపొట్టదశ నుంచి సాగునీరు అందడం కష్టంగా మారుతంది. పూర్తిస్థాయిలో పంటలు పండడం లేదు. ఆయకట్టు రోడ్డు మరమ్మతు చేయండి. ఉపాధిహామీ నిధులు ఇచ్చే అవకాశం లేకుంటే ప్రత్యామ్నాయం చూడాలి.

– రాములు, రవీందర్, నారాయణ, రాజలింగం, రైతులు

అంచనాలు రూపొందిస్తాం

కమ్మునూరు కాలువ మరమ్మతుపై సర్వేచేస్తాం. నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. నిధులు రాగానే పనులు చేపడతాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు.

– చక్రూనాయక్, డీఈ, రోళ్లవాగు ప్రాజెక్టు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రవి (ఫైల్)

కథలాపూర్ (వేములవాడ): మెట్‌పల్లి మండలం ఆత్మనగర్ గ్రామానికి చెందిన కనికారపు రవి (33) రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రవి తన అత్తగారి ఊరైన బీమారం మండలం పసునూర్ గ్రామానికి ఈనెల 26న బైక్‌పై వెళ్లాడు. అదే రాత్రి తిరిగి వస్తుండగా మండలంలోని పోసానిపేట గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య మాధురి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి బావ బొమ్మిరాల రాజుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత పేర్కొన్నారు.

'వసూళ్ల కోసమే ఇళ్ల స్థలాల డ్రామా'

కోరుట్లరూరల్: అక్రమంగా వసూళ్లకు పాల్పడడం కోసమే సీపీఐ నాయకులు ఇళ్లస్థలాల పేరిట డ్రామాలు ఆడుతున్నారని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. ఎఖీన్‌పూర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘం నాయకుడు బద్ది మురళి ఆధ్వర్యంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎఖీన్‌పూర్ శివారులో గతంలో ప్రభుత్వం దళితులకు పట్టాలు ఇచ్చిందన్నారు. అందులో సీపీఐ నాయకులు ఎర్ర జెండాలు పాతటం శోచనీయమన్నారు. అంతటితో ఆగకుండా మహిళలను రెచ్చగొట్టి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని చెప్పి రూ.500 నుంచి రూ.2,500 వరకు అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సంగెం రోడ్డు జంబిగద్దె ప్రాంతంలో కూడా ఇలాగే వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇళ్లులేని పేదలు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వమే మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర రాజేందర్, బద్ది గంగాధర్, చిన్న పెద్దులు, రవిబాబు, సంజయ్, రమేశ్, గంగాధర్, పత్తిరి అంజమ్మ, బద్ది భవాని, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

అన్నపై తమ్ముడి దాడి

సారంగాపూర్: మండలంలోని రంగపేటలో ఆదివారం భూతగాదాలో అన్నపై తమ్ముడు దాడిచేశాడు. స్టేషన్‌హౌజ్ అధికారి వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం..తోకల అంజయ్య, తమ్ముడు తోకల మొగిలి మధ్య భూవివాదం ఉంది. ఈ విషయంలో తమ్ముడు అన్న ఇంటి ముందుకు వెళ్లి నీకు భూమి ఎక్కడిదని కర్రతో దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మొగిలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని సుఖీభవ రెస్టారెంట్‌లో శనివారం రాత్రి దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. రెస్టారెంట్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న విభూతి మారుతి కౌంటర్ వద్ద ఉండగా, అర్ధరాత్రి అజయ్‌తో పాటు మరికొందరు రెస్టారెంట్‌లోకి చొరబడి మారుతిని ఉచితంగా బిర్యానీ ఇవ్వాలని కోరగా నిరాకరించాడు. దీంతో ఆగ్రహం చెందిన వారు మారుతిపై దాడిచేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

కులంపేరుతో దూషించిన వ్యక్తులపై..

జగిత్యాల క్రైమ్: జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన గిద్దె పృథ్వీరాజ్‌ను కులం పేరుతో దూషించిన నలుగురు వ్యక్తులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సుధాకర్ తెలిపిన ప్రకారం పృథ్వీరాజ్ జాబితాపూర్‌కు చెందిన మారుశెట్టి అరవింద్‌కు అప్పుగా రూ.10 వేలు ఇచ్చాడు. పృథ్వీరాజ్ జాబితాపూర్‌కు వెళ్లి అప్పు చెల్లించాలని కోరగా అరవింద్, చిత్తారి మధు, గర్వందుల రాజు, ఎండీ షకీర్‌లు కులం పేరుతో దూషించి అతడిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్

- ధర్మపురి, కోరుట్లలో సెంటర్లు ఏర్పాటు
- కిడ్నీ బాధితులకు ఉచితంగా వైద్యం
- వివిధ మండలాల నుంచి వస్తున్న రోగులు


ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రి


డయాలసిస్ సెంటర్‌లో రోగులు

ధర్మపురి : పేద ప్రజలకు ఇక కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందనుంది. జిల్లాలోని ధర్మపురి, కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రులు వైద్య విధాన పరిషత్‌లోకి అప్‌గ్రేడ్ కావడంతో అధునాతన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేశారు. రాయికల్ ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయినా అక్కడ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయలేదు. త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. అందులో భాగంగా సుమారు రూ.10 లక్షల విలువ చేసే ఆక్సిజన్ ప్లాంట్‌తో పాటు కిడ్నీ బాధితుల సౌకర్యార్థం అత్యవసరమైన డయాలిసిస్ (రక్తశుద్ధి) కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో వేల రూపాయలతో కూడుకున్న వైద్యాన్ని రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. దాదాపు రూ. 60 లక్షలతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారు.

రోజూ పది మందికి సేవలు

పేద ప్రజల సౌకర్యార్థం ధర్మపురిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇద్దరితో ప్రారంభించిన డయాలసిస్‌ను ప్రస్తుతం పదిమందికి చేరింది. పట్టణంతో పాటు మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట, ముడిమడుగు, జన్నారం మండలాలతో పాటు బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల నుంచి డయాలిసిస్ (రక్తశుద్ధి) కోసం వస్తున్నారు. జనవరిలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రత్యేక గదిలో రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా డయాలసిస్‌తో పాటు ఆక్సిజన్ ప్లాంటును ప్రారంభించగా సేవలందిస్తున్నారు. డయాలసిస్ చేసే సమయంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా ఆస్పత్రిలో ఇటీవల నూతన జనరేటర్‌ను ఏర్పాటు చేశారు.

15 పడకలు.. వంద వరకు పేషెంట్లు

జిల్లాలోని మూడు ఆస్పత్రుల్లో మొత్తం 15 పడకలు అందుబాటులో ఉండగా డయాలసిస్ కోసం సుమారు వందమంది వరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జగిత్యాలలో 5 పడకలు 55 మంది, ధర్మపురిలో 5 పడకలు ప్రస్తుతం 10 మంది, కోరుట్లలో 5 పడకలు 33 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరంతా వారానికి రెండు మూడు సార్లు ఆస్పత్రులకు వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్నారు.

ఐదు యంత్రాలు ఏర్పాటు

ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కోసం ప్రస్తుతం ఐదు యంత్రాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. ఒక్కో యంత్ర సాయంతో రోగికి రెండుగంటల పాటు డయాలసిస్ చేస్తారు. వారంలో రెండుమూడు సార్లు రోగులు డయాలసిస్ కోసం వస్తున్నారు. ఇన్‌చార్జి వైద్యుడితో పాటు జూనియర్ టెక్నీషియన్, నర్సు అందుబాటులో ఉంటారు. నిర్వహణ బాధ్యత ఎపెక్స్ కిడ్నీ కేర్ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతోంది

రూ.10 లక్షలతో ఆక్సిజన్ ప్లాంట్

ఇటీవల కరోనా బారిన పడి వందలాది మంది మృతిచెందిన విషయం తెలిసిందే. బాధితుల సౌకర్యార్థం సుమారు రూ.10లక్షలతో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ధర్మపురి, కోరుట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 500 లీటర్ల కెపాసిటీ గల ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ప్లాంట్‌లో ప్రత్యేక పరికరాలు ఎయిర్ సర్జ్‌ట్యాంం, రిసీవర్ ట్యాంక్, పది సిలిండర్లను ఏర్పాటు చేశారు.

ఆరు నెలల నుంచి బాధపడుతున్నా



ఆరునెలల నుంచి రెండు కిడ్నీల సమస్యతో బాధపడుతున్న. ఇంతకముందు వారంలో రెండుసార్లు డయాలసిస్ కోసం కరీంనగర్‌కు వెళ్లేది. ఇప్పుడా సమస్య తప్పింది. ధర్మపురిలోనే సేవలందిస్తున్నారు.

– సాయికృష్ణ, కలమడుగు, జన్నారం మండలం

ఎంతో సౌకర్యంగా ఉంది



రెండు కిడ్నీలు చెడిపోయాయి. డయాలసిస్ కోసం ఇంతకు ముందు కరీంనగర్‌కు వెళ్లేది. దీంతో వెళ్లినప్పుడల్లా రూ.5వేలు అయ్యేది. నెలకు రూ.25 వేల వరకు ఖర్చు అవుతుండేది. పట్టణంలోనే ఏర్పాటు చేయడంతో పైసా ఖర్చులేకుండా ఎంతో సౌకర్యంగా ఉంది. వారానికోసారి వచ్చి డయాలసిస్ చేసుకుంటున్నా.

– రాజమ్మ, సిరికొండ

మంచి స్పందన లభిస్తోంది



ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రానికి స్పందన లభిస్తోంది. ప్రస్తుతం కేంద్రంలో పది మంది పేషెంట్లకు సేవలు అందిస్తున్నాం. ఏప్రిల్‌లో 67 డయాలసిస్ సైకిల్స్, మే నెలలో 90 వరకు చేశాం. రోగులకు అన్ని వసతులు కల్పించాం.

– నవీన్ ఆస్పత్రి సూపరింటెండెంట్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


మేడిపెల్లిలో సమావేశమైన పూర్వవిద్యార్థులు

కథలాపూర్: మేడిపెల్లి మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1998–99 లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. బీమారం మండలం మన్నెగూడెంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2004–05లో చదివిన ఎస్సెస్సీ పూర్వ విద్యార్థుల సమావేశం జరగగా అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.

పెగడపల్లిలో..


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పెగడపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1985 నుంచి 90వ సంవత్సరంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠశాలలో చదివిన రోజులను గుర్తు చేసుకుంటూ తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని రోజంతా ఉత్సాహంగా గడిపారు. కాగా మంత్రి ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత పాల్గొని కేక్‌కట్ చేశారు. అప్పటి గురువులు కిషన్‌రావు, పరంధాములు, కిష్టయ్య, లక్ష్మణ్, పాఠశాల హెచ్‌ఎం లచ్చయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ధర్మపురి : మండలంలోని జైనా, కమలాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆదివారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కస్తూరి సత్యం మాట్లాడుతూ . నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తి కాలేదని, కొనుగోళ్లలో జాప్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందలేదన్నారు. నాయకులు పిల్లి శ్రీనివాస్, ఓరుగంటి చంద్రశేఖర్, ఆకుబత్తిని తిరుపతి, సంగెపు గంగారాం, మరిపెల్లి సత్యం, బండారు లక్ష్మణ్, వేముల కర్నాకర్ రెడ్డి తదితరులున్నారు.

సన్మానం


సురేశ్‌ను సన్మానిస్తున్న స్నేహితులు

సారంగాపూర్: జ్యోతిష్య శాస్త్రంలో డాక్టరేట్ పొందిన యశోద సురేశ్‌ను స్నేహితులు ఆదివారం ఘనంగా సన్మానించారు. మండలంలోని నర్సింహుల పల్లె గ్రామానికి చెందిన సురేశ్ యునైటెడ్ థియలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీలో ఆస్ట్రాలజికల్ వాస్తులో పీహెచ్‌డీ చేయడంతో ఆయనకు డాక్టరేట్ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా ఆయనను బీర్‌పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలిసి చదివిన ఎస్సెస్సీ మిత్రబృందం ఘనంగా సన్మానించారు.

నివాళి

జగిత్యాల టౌన్ : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని ఆదివారం జగిత్యాల టవర్ సర్కిల్ టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా నాయకులు కొండయ్య మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు. బత్తుల కొండయ్య, సోమ నారాయణ, జున్ను మల్లయ్య, మగ్గిడి గంగాధర్, నక్క లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈత, తాటి వనం దగ్ధం


కాలిపోయిన తాటి చెట్లు

ధర్మపురి : ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం ఈత, తాటి వనం దగ్ధమైనట్లు గీత కార్మికులు తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్ సమీపంలోని జాతీయ రహదారి పక్కనున్న ఈత, తాటి వనంలో ఆదివారం మంటలు వ్యాపించి ఈత, తాటి చెట్లు కాలిపోయాయి. గ్రామస్తులు ఫైరింజన్‌కు సమాచారం అందించగా సిబ్బంది, వాటర్ ట్యాంకర్ల ద్వారా మంటలను ఆర్పివేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లికి చెందిన పిట్టల సురేందర్(30) విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో తన అన్నయ్య కొత్తగా నిర్మించుకున్న రేకుల షెడ్డుకు సురేందర్ ఆదివారం సాయంత్రం నీళ్లు పడుతున్నాడు. ఈ క్రమంలో పైన ఉన్న 11 కేవీ వైరు చేతికి తగలడంతో విద్యుదాఘాతం సంభవించి, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ధర్మపురి : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎల్‌డీఎం కో ఆర్డినేటర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన లీడర్ షిప్ డెవలప్‌మెంట్ మిషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఎస్సీ రిజర్వుడ్ ధర్మపురి అసెంబ్లీ స్థానాన్ని కైవసం చేసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. బీజేపీకి కనీసం 20 స్థానాల్లో అభ్యర్థులు లేరని, కర్ణాటక ఎన్నికల ఫలితాలే తెలంగాణలో పునరావృతం కానున్నాయని జోస్యం చెప్పారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో దళితబంధు కోసం బడ్జెట్ ఆమోదించిన ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ హయాంలో పథకా లను పక్కన పెట్టి కల్యాణలక్ష్మి పథకాన్ని తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, బీసీ, కి సాన్ సెల్ అధ్యక్షుడు, యూత్ కాంగ్రెస్ నేతలు, ధర్మపురి నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజేశ్, చి లుముల లక్ష్మణ్, రాందేని మొగిలి, సుముఖ్, స్తంభంకాడి గణేశ్, అప్పం తిరుపతి, తదితరులున్నారు.

మద్దునూర్ వాసికి సీఏ పట్టా


సీఏ పట్టాతో అరిగెల తిరుపతి

బుగ్గారం: మండలంలోని మద్దునూర్ గ్రామానికి చెందిన అరిగెల తిరుపతి సీఏ పట్టా పొందాడు. శనివారం హైదరాబాద్‌లోని శిల్పా కళావేదికలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో పట్టా అందుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన తిరుపతి తండ్రి లింగయ్యగౌడ్ కులవృత్తి నిర్వహిస్తుండగా తల్లి వ్యవసాయ కూలీగా పనిచేస్తోంది. వీరికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తిరుపతి పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం పూర్తిచేసి ఇంటర్ కరీంనగర్‌లో చదివాడు. సీఏ పట్టా సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


మోసపోయిన బాధితులు

కథలాపూర్ (వేములవాడ): గల్ఫ్‌లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని లేబర్ వీసాతో పంపించి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అంబారిపేట, కలిగోట గిరిజన తండాలకు చెందిన యువకులతోపాటు రాజన్న సిరిసిల్ల జిల్లా మానాలకు చెందిన సుమారు 11 మంది కథలాపూర్ మండలంలోని సిరికొండకు చెందిన గల్ఫ్ ఏజెంట్ ద్వారా దోహాఖత్తార్ దేశం వెళ్లారు. ఒక్కో వీసాకు రూ. 3 లక్షలు ఏజెంట్‌కు చెల్లించామని బాధితులు తెలిపారు. అక్కడికి వెళ్లాక ఫ్యాక్టరీల్లో బస్తాలు మోసే పనులు చేయించారని, నెల గడిచినా అదే లేబర్ పనిచేయించడంతో ఏజెంట్‌ను ఫోన్‌లో సంప్రదిస్తే సరైన సమాధానం రాలేదన్నారు. దీంతో తామంతా మోసపోయామని కుటుంబీకులకు సమాచారం ఇస్తే విమానం టికెట్ డబ్బులు పంపించడంతో ఇంటికి చేరుకున్నట్లు బాధితులు పేర్కొన్నారు. తమను మోసం చేసిన ఏజెంట్‌తో పాటు అతనికి మధ్యవర్తిగా వ్యవహరించిన ఇప్పపెల్లికి చెందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు విన్నవించారు.

శుభకార్యానికి వెళ్లొస్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
- రెండు కుటుంబాల్లో విషాదం


నాగరాజు(ఫైల్)


కొలనూర్‌లో జరిగిన ప్రమాద దృశ్యం

కోనరావుపేట(వేములవాడ): శుభకార్యానికి వెళ్లి తిరిగొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన అన్నదమ్ములు అనుముల ఓదెలు(63), అనుముల లింగారెడ్డి(55), లింగారెడ్డి కొడుకు నాగరాజు(30) ముగ్గురు కలిసి ఆదివారం నిజామాబాద్ జిల్లా గాంధారికి వెళ్లారు. అక్కడ కార్యక్రమం పూర్తికాగానే ఇంటికి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. కొలనూర్ శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఓదెలు, నాగరాజు సిరిసిల్ల ఆస్పత్రిలో మృతిచెందారు. లింగారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతితో రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

మృతదేహంతో పరుగులు

సిరిసిల్లక్రైం: కోనరావుపేట మండలం మర్తనపేట శివారు మార్గదర్శి పాఠశాల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహంతోపాటు మరొకరిని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇరువురి మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం చేసేందుకు మృతదేహాన్ని గదిలోకి తీసుకెళ్లారు. ఇంకో మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు వైద్య సిబ్బంది వస్తున్న క్రమంలో మరొకరు మృతి చెందలేదని, కదలికలున్నాయని బాధిత కుటుంబీకుల్లో ఒకరు ఆరోపించారు. ఇక్కడి వైద్యులపై నమ్మకం లేదని, మరో ఆస్పత్రికి తీసుకెళ్తామని స్ట్రెచ్చర్‌పై ఉన్న మృతదేహంతో బాధితుల కుటుంబీకులు అంబేడ్కర్ చౌరస్తామీదుగా పరుగులు తీశారు. ఆపేందుకు యత్నించే క్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాజుపై ఒకరు చేయి చేసుకున్నారు. బతికున్న వారిని చనిపోయారని చెబుతున్నారని, తమకు అంబులెన్స్ ఇస్తే మరో ఆస్పత్రికి తీసుకెళ్తామని పోలీసులకు తెలపడంతో అంబులెన్స్‌లో మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

గుండెపోటుతో గృహిణి మృతి


రేవతి (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన సాయిలి రేవతి (25) ఆదివారం గుండెపోటుతో మృతిచెందింది. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే రేవతి చిన్న వయస్సులోనే మృతిచెందంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతురాలికి భర్త సాయిలి రమేశ్, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కాలు పని చేయక.. కదల్లేక

- నాలుగు రోజులుగా ఎద్దు యాతన
- రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతం



కదల్లేని ఎద్దుకు సపర్యలు చేస్తున్న రైతు, రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట శివారులో ఓ ఎద్దు మేత మేస్తూ రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. దాని తోక ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై, పడిపోయింది. ఎద్దు కాలు పని చేయకపోవడంతో ఎటూ కదల్లేక నాలుగు రోజులుగా యాతన పడుతోంది. పశువైద్యాధికారితో చికిత్స చేయిస్తున్నానని రైతు తోకల శంకరయ్య తెలిపాడు. పంట భూముల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేయడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధం

జూలపల్లి(పెద్దపల్లి): పొలం నుంచి వరి గడ్డి కట్టలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా 33 కేవీ ప్రధాన లైన్ విద్యుత్ తీగలు తగిలి దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. జూలపల్లికి చెందిన రైతు మల్లెత్తుల సంతోశ్ ఆదివారం తన పొలం నుంచి గడ్డి కట్టలను ట్రాక్టర్‌లో ఇంటికి తీసుకెళ్తున్నాడు. విద్యుత్ తీగలు కిందికి ఉండటంతో గడ్డి కట్టలు వాటికి తగిలి, మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల రైతులు వచ్చి, ఆర్పే ప్రయత్నం చేసినా సాధ్యం కాకపోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. చొప్పదండి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. లేకుంటే ట్రాక్టర్ కూడా కాలిపోయేదని కాంగ్రెస్ నాయకుడు బండి శ్రీనివాస్ తెలిపారు. కరెంటు వైర్లను ఎత్తు లేపాలని ఎన్నోసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.10 వేల నష్టం జరిగినట్లు ఫైర్ స్టేషన్ అధికారి నరేందర్ పేర్కొన్నారు.